## బ్యాంకులో చోరీకి యత్నం


క్లూస్ టీంతో పరిశీలిస్తున్న పోలీసులు

ముథోల్, సెప్టెంబర్ 14 : ముథోల్‌లోని పాత బస్టాండ్‌లో గల ఎస్‌బీఐ బ్యాంకులో శుక్రవారం అర్ధరాత్రి గుర్తు తెలియని దుండగులు చోరీకి యత్నించినట్లు ఎస్సై సాయికృష్ణ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. బ్యాంకు వెనుక భాగంలో గల వెంటిలేటర్ పగలగొట్టి బ్యాంకులోకి చొరబడినట్లు గుర్తించామన్నారు. బ్యాటరీ తదితర వైర్లను ధ్వంసం చేసినట్లు వెల్లడించారు. బ్యాంకులో ఏమీ చోరీకి గురికాలేదని వివరించారు. క్లూస్ టీం బృందంతో క్షుణ్ణంగా తనిఖీ చేశారు. బ్యాంకు మేనేజర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.

## మాదక ద్రవ్యాలపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న ఠాగూర్ దత్తు

భైంసా, సెప్టెంబర్ 14 : పట్టణం లోని రెయిన్‌బో పాఠశాలలో మాదక ద్రవ్యాలపై శనివారం అవగాహన కల్పించారు. సోషల్ జస్టిస్ ఫర్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ నిర్మల్ జిల్లా డైరెక్టర్ ఠాగూర్ దత్తు మాట్లాడుతూ మాదక ద్రవ్యాలకు యువత ఆకర్షితులు కాకూడదని, తమపై ఆశలు పెట్టుకున్న తల్లిదండ్రుల కోసమైన ఆలోచించాలన్నారు. ఇందులో ముథోల్ నియోజకవర్గ డైరెక్టర్ సాప పండరి, ప్రిన్సిపాల్ ఇమ్రాన్ పాల్గొన్నారు.

## రిమ్స్‌లో ఐదుగురు డాక్టర్ల నియామకం

ఎదులాపురం, సెప్టెంబర్ 14 : రిమ్స్‌లో ఐదుగురు డాక్టర్లు నియాకమైనట్లు రిమ్స్ డైరెక్టర్ రాథోడ్ జైసింగ్ శనివారం తెలిపారు. ఇటీవల 25 మంది వైద్యులను ఇంటర్వ్యూ నిర్వహించిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగానే శనివారం రిమ్స్‌కు ఈఎన్‌టీ, ప్యాథలాజి, జనరల్ మెడిసిన్, ఆర్థోలో అసిస్టెంట్ ప్రొఫెసర్లుగా, ఒక్కరు సీఎంవోగా విధుల్లో చేరారు. 27 మంది 16 మంది సీఎంవోలు, 11 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లు ఉన్నారు. మిగిలిన వారు కూడా త్వరలో విధుల్లో చేరుతారని డైరెక్టర్ తెలిపారు.

# ఓటరు జాబితా ముసాయిదా విడుదల

**● 473 పంచాతీయల్లో 4,41,700 మంది ఓటర్లు ● మహిళా ఓటర్లు అధికం ● 21 వరకు అభ్యంతరాల స్వీకరణ**


తాంసి మండలంలోని పొన్నారి జీపీలో ఓటరు జాబితా ప్రదర్శన

ఆదిలాబాద్, సెప్టెంబర్ 14(నమస్తే తెలంగాణ) : ఆదిలాబాద్ జిల్లాలో గ్రామ పంచాయతీ ఎన్నికల ఓటరు ముసాయిదాను అధికారులు విడుదల చేశారు. 17 గ్రామీణ మండలాల్లోని 473 పంచాయతీల్లో 4,41,700 మంది ఓటర్లు ఉన్నట్లు గుర్తించారు. పంచాయతీ ఓటర్లలో పురుష ఓటర్ల కంటే మహిళా ఓటర్ల సంఖ్య అధికంగా ఉంది. పురుష ఓటర్లు 2,16,242 మంది ఉండగా.. మహిళా ఓటర్లు 2,25,443 మంది, ఇతర ఓటర్లు 15 మంది ఉన్నారు. పురుష ఓటర్ల కంటే మహిళా ఓటర్లు 9,201 మంది ఎక్కువగా ఉన్నారు. ఆయా గ్రామ పంచాయతీల్లో వార్డులవారీగా రూపొందించిన ఓటరు జాబితా ముసాయిదాను అధికారులు పంచాయతీ కార్యాలయాల్లో అందుబాటులో ఉంచారు. అన్ని మండలాల్లో పురుషుల కంటే మహిళా ఓటర్లు అధికంగా ఉన్నారు.

### 21 వరకు అభ్యంతరాల స్వీకరణ

గ్రామ పంచాయతీల్లో ఓటరు ముసాయిదా జాబితాను అందుబాటులో ఉంచిన అధికారులు ఈనెల 21వ తేదీ వరకు అభ్యంతరాలను స్వీకరించనున్నారు. జాబితాలో ఏమైన పొరపాట్లు ఉంటే పంచాయతీ కార్యదర్శులకు తెలియజేయాలని అధికారులు సూచించారు. గ్రామాల్లోని ఒకే కుటుంబానికి చెందిన ఓటర్లను ఒకే వార్డులు చేరాలి. జాబితాలో తప్పులను సరిచేసి షెడ్యూల్ ప్రకారం ఈనెల 28వ తేదీన తుది జాబితాను విడుదల చేస్తామని అధికారులు అంటున్నారు.

### ఉట్నూర్‌లో అధికంగా 50,508 మంది ఓటర్లు

ఉట్నూర్ గ్రామ పంచాయతీలో ఎక్కువగా 50,508 మంది ఓటర్లు ఉండగా, మావల మండలంలో తక్కువగా 4,123 మంది ఓటర్లు ఉన్నారు. జైనథ్ మండలంలో 39,249 మంది, బోథ్‌లో 37526, ఇచ్చోడలో 34403, బేలలో 31183, ఇంద్రవెల్లిలో 30606, ఆదిలాబాద్ గ్రామీణంలో 29400, తలమడుగులో 27524, గుడిహత్నూర్‌లో 24745, బజార్‌హత్నూర్‌లో 24435, నేరడిగొండలో 23557, నార్నూర్‌లో 22872, భీంపూర్‌లో 19117, గాదిగూడలో 15721, సిరికొండలో 14106, తాంసిలో 13625, మావలలో 4,123 మంది ఓటర్లు ఉన్నారు.

## గణేశుడికి మాజీ మంత్రి పూజలు


పూజ చేస్తున్న మాజీ మంత్రి జోగు రామన్న

ఎదులాపురం, సెప్టెంబర్ 14 :ఆదిలాబాద్ పట్టణంలోని పలు చోట్ల ఏర్పాటు చేసిన గణేశ్ మండపాల వద్ద మాజీ మంత్రి జోగు రామన్న ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలు మండపాల వద్ద ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రామన్న మాట్లాడుతూ.. హైదరాబాద్ తర్వాత గణేశ్ ఉత్సవాల శోభ ఆదిలాబాద్‌లో సంతరించుకుంటుందన్నారు. ఉత్సవ నిర్వాహకులు వారు తీసుకునే బాధ్యత ఎంతో గొప్పదని కొనియాడారు. భక్తిశ్రద్ధలతో ఆధ్యాత్మికతను పెంపొందిస్తూ ఎల్లవేళలా ముందుండాలని సూచించారు. ఈ కార్యక్రమాలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మెట్టు ప్రహ్లాద్, రంగినేని శ్రీనివాస్, దేవన్న, సాయి, సంతోష్, ధారవేణి రాము, నర్సాగౌడ్, కృష్ణ పాల్గొన్నారు.


గడ్డెన్నవాగు ప్రాజెక్టు వద్ద నిమజ్జనం కోసం ఏర్పాటు చేసిన మున్సిపల్ అధికారులు

# భైంసాలో నేడు గణేశ్ నిమజ్జనం

**పోలీసుశాఖ ప్రత్యేక దృష్టి**

భైంసా, సెప్టెంబర్ 14 : భైంసాలో వినాయక నిమజ్జనోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించేందుకు భక్తులు సిద్ధమయ్యారు. సమస్యాత్మక ప్రాంతమైన భైంసాలో ప్రశాంతంగా నిర్వహించేందుకు భారీ భద్రత ఏర్పాటు చేస్తున్నారు. బస్టాండ్, పంజేషాచౌక్, నిర్మల్ చౌరస్తా, మార్కెట్ ఏరియా, కుభీర్ చౌరస్తాతోపాటు ప్రధాన కూడళ్లలో దాదాపు 200 వరకు సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. పలు ప్రాంతాల్లో పికెటింగ్‌లు వేశారు. పెట్రోలింగ్ నిర్వహిస్తూ సమీక్షిస్తున్నారు. శోభాయాత్ర నిర్వహించే ప్రధాన రహదారుల్లోని విద్యుత్ తీగలు, కేబుల్ వైర్లతో ప్రమాదం లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ట్రాన్స్‌కో సిబ్బందికి అధికారులు సూచించారు. పట్టణంతోపాటు గ్రామాల్లో బెల్టు షాపులు, మద్యం దుకాణాలను శనివారం సాయంత్రం నుంచి మూసి వేయించారు. ఆదివారం కూడా బంద్ చేయాలని ఆదేశించారు.

### భారీ బందోబస్తు

ఎస్పీ జానకి షర్మిల, ఏఎస్పీ అవినాశ్ కుమార్ ఆధ్వర్యంలో భారీ భద్రత కల్పిస్తున్నారు. ఎస్పీ ఒకరు, ఏఎస్పీ ఒకరు, డీఎస్పీలు ఇద్దరు, సీఐలు 28, ఎస్ఐలు 32, అదనపు పోలీసు సిబ్బంది 650 మంది బందోబస్తులో పాల్గొననున్నారు. పోలీస్‌స్టేషన్‌లో ప్రత్యేక కంట్రోల్ రూం ఏర్పాటు చేశారు. పట్టణంలో ఎక్కడ సమస్య తలెత్తినా పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. కాగా.. ఇప్పటికే పట్టణంలో శాంతి సమావేశం, ఉత్సవ కమిటీ గణేశ్ మండలీలు, యువజన సంఘాల సభ్యులతో ఎస్పీ, ఏఎస్పీ ప్రత్యేక సమావేశాలు నిర్వహించారు. పండుగలను శాంతియుతంగా జరుపుకోవాలని నిమజ్జనోత్సవ శోభాయాత్ర ప్రశాంతంగా సాగేందుకు ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు. నిమజ్జనోత్సవానికి మున్సిపల్ వైస్ చైర్మన్ జాబీర్ అహ్మద్, మున్సిపల్ కమిషనర్ రాజేశ్ కుమార్ ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. రోడ్లపై గుంతలను పూడ్చారు. అధికారులు గడ్డెన్నవాగు ప్రాజెక్టు వద్ద ప్రత్యేక భారీ కేడ్‌లను కట్టారు. విగ్రహాలను నిమజ్జనం చేసేందుకు క్రేన్‌లు,గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచారు.


సీసీ కెమెరాలు ఏర్పాటు చేసిన పోలీసు సిబ్బంది


మాట్లాడుతున్న ఏఎస్పీ అవినాశ్ కుమార్

### శోభాయాత్ర

భైంసా పట్టణంలో నాటి నుంచి నేటి వరకు ఒకే మార్గం గుండా శోభాయాత్ర నిర్వహిస్తున్నారు. భట్టిగల్లిలోని మున్నూరు కాపు సంఘం, గోపాల కృష్ణ మందిరంలోని గణేశ్ వద్ద ప్రతిష్ఠించిన వినాయకుల వద్ద ఎస్పీ, ఎమ్మెల్యే, హిందూ ఉత్సవ సమితి సభ్యులతోపాటు పలువురు ప్రముఖులు పూజలు చేసి శోభాయాత్రను ప్రారంభించనున్నారు. ఈ శోభాయాత్ర గణేశ్‌నగర్ మీదుగా కోర్బగల్లి, పంజేషా చౌక్, కిసాన్‌గల్లి, పురాణాబజార్ మీదుగా ప్రాజెక్టు వరకు సాగుతుంది.


ఆదిలాబాద్‌లో వినాయకుడికి పూజలు చేస్తున్న మల్టీజోన్ వన్ ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి

## గణేష్ నిమజ్జనాన్ని ప్రశాంతంగా నిర్వహించాలి

ఎదులాపురం, సెప్టెంబర్ 14 : ఆదిలాబాద్ జిల్లా పర్యటనలో భాగంగా మల్టీజోన్ వన్ ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి శనివారం సాయంత్రం ద్వారకానగర్ వినాయకుడిని దర్శించుకుని పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు ఐజీకీ స్వాగతం పలికారు. ఐజీ చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ.. జిల్లాలో గణపతి నిమజ్జనానికి పటిష్ఠ పోలీసు బందోబస్తు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ గౌష్ ఆలం, ఆడిషనల్ ఎస్పీ సురేందర్‌రావు, డీఎస్పీ జీవన్‌రెడ్డి, సీఐ సునీల్ కుమార్ పాల్గొన్నారు.

## ముచ్చటగా మూడు ఉద్యోగాలు


కుమారుడు ముత్యాల సాయికృష్ణను అభినందిస్తున్న తల్లిదండ్రులు

ఎదులాపురం, సెప్టెంబర్ 14 : ఆదిలాబాద్ పట్టణంలోని చించరవాడకు చెందిన ముత్యాల పొచన్న-రూప దంపతుల పెద్ద కుమారుడు ముత్యాల సాయికృష్ణ ముచ్చటగా మూడు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించాడు. 2018లో నిర్వహించిన గ్రూప్‌లో ప్రతిభ చాటి ఆసిఫాబాద్ ఎస్పీ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు కొనసాగిస్తున్నారు. ఇదే క్రమంలో 2022లో నిర్వహించిన గ్రూప్స్‌కు సన్నద్ధం అయి మెరిట్‌లో ఉన్నాడు. తాజాగా ఆగస్టులో ఇంటెలిజెన్స్ బ్యూరో నిర్వహించిన అసిస్టెంట్ ఎనలైటిక్ ఆఫీసర్ పోస్టుకు పరీక్ష రాశారు. దీనికి సంబంధిన ఫలితాలు శుక్రవారం వెలువడగా ఉత్తీర్ణత సాధించాడు. ఇప్పటికే ఉద్యోగంలో ఉంటూ గ్రూప్, ఇంటెలిజెన్స్ పోటీ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించడంపై తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేస్తు స్వీట్లు తినిపించారు.ఉన్నత లక్ష్యాల సాధనకు కష్టపడి చదివితే విజయవరిస్తుందని సాయికృష్ణ అన్నారు. ప్రస్తుతం ఇంటెలిజెన్స్ అసిస్టెంట్ ఎకలైటిక్ ఆఫీసర్ ఉద్యోగంలో చేరడానికి సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. పిల్లలు ప్రయోజకులు అయితే ఆనందంగా ఉంటుందని సాయికృష్ణ తండ్రి పొచ్చన్న అన్నారు. తల్లిదండ్రులు వారిని స్వేచ్ఛను ఇస్తు జీవితంలో సాధించే లక్ష్యాలను తెలుసుకుంటు మరింత ప్రోత్సాహం ఇవ్వాలని కోరారు.


పిట్టబొంగురం పీహెచ్‌సీలో ప్రసూతి వివరాలను తెలుసుకుంటున్న జిల్లా వైద్యాధికారి కృష్ణ

## విధులపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

**జిల్లా వైద్యాధికారి కృష్ణ**

ఇంద్రవెల్లి, సెప్టెంబర్ 14 : విధి నిర్వహణలో వైద్యాధికారులతోపాటు వైద్య సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా వైద్యాధికారి కృష్ణ హెచ్చరించారు. శనివారం మండలంలోని పిట్టబొంగురం పీహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీ చేశారు. పీహెచ్‌సీతోపాటు ఓపీ, ప్రసూతి వివరాలు, రోగుల వివరాల నమోదు రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైద్యాధికారులతోపాటు వైద్య సిబ్బంది సమయపాలన పాటించి ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రసూతిల సంఖ్యలను పెంచాలని, జ్వరాలపై గ్రామాల్లో సర్వేలు నిర్వహించాలన్నారు. అనంతరం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. పిల్లల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మలేరియా, ఎస్‌సీడీ ప్రొగ్రాం అధికారి శ్రీధర్, వైద్యుడు ప్రతాప్‌సింగ్ నాయక్, హెచ్ఈవో గోకుల్ పాల్గొన్నారు.


పోలీసులకు సూచనలు చేస్తున్న మల్టీ జోన్ ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి

## శాంతియుతంగా జరుపుకోవాలి

**● నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు ● మల్టీ జోన్ ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి**

నిర్మల్ అర్బన్, సెప్టెంబర్ 14 : గణేశ్ నిమజ్జన శోభాయాత్రను ప్రశాంత వాతావరణంలో శాంతియుతంగా నిర్వహించాలని మల్టీ జోన్ ఐజీ చంద్రశేఖర్ అన్నారు. భైంసా, నిర్మల్ పట్టణాల్లో నిమజ్జనం సందర్భంగా పోలీసులకు పలు సూచనలు చేశారు. శోభాయాత్రకు ఇబ్బంది కలిగించేలా ప్రవర్తించిన వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. భారీ శబ్దంతో కూడిన డీజేలను వాడరాదని, పక్క రాష్ట్రాల నుంచి వచ్చే డీజేలను అనుమతించవద్దని, బాణసంచా కాల్చడం వంటివి చేయకూడదని సూచించారు. లేజర్ లైట్ల వల్ల ప్రజలకు ఇబ్బందులు కలుగుతాయని డీజే వాహనంపై పేపర్ షాట్‌లను వాడొద్దని అన్నారు. విగ్రహాలను తీసుకువెళ్లే వాహనాలపై మద్యం మత్తులో ఉన్న వారిని అనుమతించకూడదని, రెచ్చగొట్టే నినాదాలు చేయడం, మత స్థలాల వద్ద ఊరేగింపులను ఆపడం చేయరాదన్నారు. విగ్రహ మూర్తులు ఉదయమే బయలుదేరేలా ఉత్సవ సమితి సభ్యులు ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. ముందస్తు ప్రణాళికతో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. నిర్మల్, భైంసా ప్రాంతాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు గురించి అడిగి తెలుసుకున్నారు. ఈయన వెంట ఎస్పీ జానకి షర్మిలతోపాటు డీఎస్పీ గంగారెడ్డి, సీఐలు ప్రవీణ్, నవీన్, రామకృష్ణ, అశోక్ ఉన్నారు.

# రోడ్డు కోతతో అవస్థలు

**● ఇటీవల కురిసిన వర్షాలకు కొట్టుకుపోయిన అప్రోచ్ రోడ్డు**

**● రెండు జిల్లాల వాహనదారులకు తప్పని తిప్పలు**

ఖానాపూర్, సెప్టెంబర్ 14 : నిర్మల్ జిల్లాలోని ఖానాపూర్ పట్టణ శివారులో నిర్మిస్తున్న రెంకొనివాగు బ్రిడ్జి వద్ద ఏర్పాటు చేసిన అప్రోచ్ రోడ్డు తాజాగా కురిసిన భారీ వర్షాలకు కోతకు గురికాగా వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ రహదారి మీదుగా ఖానాపూర్ నియోజకవర్గంలోని ఏడు మండలాలతో పాటు మంచిర్యాల జిల్లాకు చెందిన వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. కోతకు గురైన రహదారితో ప్రజలు, వ్యాపారులు, వాహనదారులు, విద్యార్థులు, రైతులు, పశువుల కాపారులు ఇబ్బందులు పడుతున్నారు. నెలలు గడుస్తున్నా ఎవరు పట్టించుకోకపోవడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆర్అండ్‌బీ అధికారులు, పాలకులు స్పందించి బ్రిడ్జి నిర్మాణ పనులను సకాలంలో పూర్తి చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

### అత్యవసర సేవలకు ఇబ్బంది

ఖానాపూర్, పెంబి, కడెం, దస్తురాబాద్ మండలాలకు చెందిన గర్భిణులు, రోగులు అత్యవసర సమయాల్లో ఖానాపూర్ ప్రభుత్వ దవాఖానకు వెళ్లాలంటే సరైన రోడ్డు సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వానకాలం దృష్ట్యా సీజనల్ వ్యాధులతో బాధపడుతూ దవాఖానకు నిత్యం వందలాది మంది రోగులు వస్తుంటారు. పట్టణ కేంద్రానికి రెండు కిలో మీటర్ల దూరంలో ఉన్న తర్లపాడు, దిలావర్‌పూర్ గ్రామాల ప్రజలు రాత్రి వేళల్లో రోడ్డు సౌకర్యం లేక ప్రాణం గుప్పిట్లో పెట్టుకుని పది కిలోమీటర్ల దూరం నుంచి తిరిగి దవాఖానకు వెళ్లాల్సి వస్తున్నది.

**నిత్యావసర సరుకులకు ఇబ్బంది అవుతున్నది**



ఖానాపూర్ పట్టణానికి నిత్యావసర సరుకుల కోసం వెళ్లాలంటే రూ.40 చెల్లించాల్సి వస్తున్నది. రెంకొనివాగు వద్ద బ్రిడ్జి వద్ద నిర్మించిన అప్రోచ్ రోడ్డు కోతకు గురవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. కుమ్మం భీం చౌరస్తా నుంచి వెళ్లాల్సి వస్తున్నది. అభివృద్ధి పనులపై అధికారులు ఆలసత్వం వహించకుండా పనులను చేపట్టాలి.

*- బొరువోంతుల నగేశ్, ప్రయాణికుడు.*


వరద కోతకు గురైన ఖానాపూర్-తర్లపాడు రెంకొనివాగు పక్కన గల తాత్కాలిక రోడ్డు


అవస్థలు పడుతున్న వాహనదారులు, ప్రజలు


సంతకాల సేకరణలో పాల్గొన్న నాయకులు

## పథకాలను పకడ్బందీగా అమలు చేయాలి

**● నేతాజీచౌక్‌లో సంతకాల సేకరణ ● సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కిరణ్**

ఎదులాపురం, సెప్టెంబర్ 14 : భవన నిర్మాణ కార్మికులకు ప్రభుత్వం పథకాలను పకడ్బందీగా అమలు చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కిరణ్ అన్నారు. కార్మిక సంక్షేమ బోర్డు స్కీంలు వాటిని ప్రైవేట్ ఇన్సూరెన్స్ సంస్థలకు అప్పగించడాన్ని నిరసిస్తూ శనివారం నేతాజీ చౌక్‌లో సంతకాల సేకరణ చేపట్టారు. ఆయా కార్మిక సంఘాల నాయకులతో కలిసి కార్మికులపై ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరును తెలియజేస్తూ సంతకాలను సేకరించారు. ఈ సందర్భంగా కిరణ్ మాట్లాడుతూ.. భవన నిర్మాణ రంగంలో పనిచేసే కార్మికుల కోసం ప్రభుత్వ పథకాలను అమలు చేస్తుందన్నారు. ప్రమాదబీమా, పాక్షిక, శాశ్వత అంగవైకల్యం, సహజ మరణం వాటిని ప్రైవేట్ వారికి ఇచ్చేలా చూస్తుందన్నారు. అదేవిధంగా ఈనెల 16న టీఎన్జీవోస్ భవనంలో రౌండ్ టేబుల్ సమావేశం, 18న కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బొజ్జ ఆశన్న, ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకట్ నారాయణ, జిల్లా నాయకులు సుభాష్, బి.నర్సింగ్, దేవీదాస్, మారుతి, టీయూసీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి జగన్ సింగ్, సహాయ కార్యదర్శి ఉమ్రే నితిన్, ఉపాధ్యక్షుడు సర్కలే రాజు, సీఐటీయూ నాయకులు అశోక్, విఠల్, బాగువన్ పాల్గొన్నారు.